క్లుప్తంగా

శ్రీవేంకటేశ్వరస్వామివారి ఊరేగింపు



కథలాపూర్: తాండ్ర్యాల గ్రామంలో శ్రీవేంకటేశ్వరస్వామి వారిని బుధవారం పల్లకిలో ఊరేగించారు. అడవిలో గుట్టపై ఉన్న స్వామివారిని ఆషాఢమాసంలో గ్రామంలోకి తీసుకురావడం ఆనవాయితీగా వస్తోందని గ్రామస్తులు తెలిపారు. అర్చకుడు సీతారామాచార్యులు ఆధ్వర్యంలో జలాభిషేకం చేశారు.

హాస్టళ్లలో తనిఖీ

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలోని హాస్టళ్లను ఇన్‌చార్జి ఎంపీడీవో రాజేందర్‌రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. ఎస్సీ, బీసీ, కేజీబీవీ, మోడల్ స్కూల్ వసతి గృహాల్లో సౌకర్యాలు, భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీవో చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ రజిత తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ ఐకాన్ అవార్డు అందజేత



అవార్డు అందిస్తున్న బాలీవుడ్ నటి శిల్పాశెట్టి

మెట్‌పల్లి: పట్టణానికి చెందిన గైనకాలజిస్టు డాక్టర్ చిట్నేని హేమ ఎక్సలెన్స్ గ్లోబల్ ఐకాన్ సెకండ్ ఎడిషన్ అవార్డు అందుకున్నారు. ఫెర్టిలిటీ, ఆండ్రాలజీ విభాగాల్లో విశేష సేవలందించినందుకు గానూ ఆమెను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. రెండు రోజుల క్రితం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో బాలీవుడ్ నటి శిల్పాశెట్టి చేతులమీదుగా అందజేశారు.

విద్యార్థినికి సత్కారం



గొల్లపల్లి: సకుర సైన్స్ ప్రోగ్రాంలో ఐదోస్థానంలో నిలిచి, జపాన్ పర్యటన కోసం రిజర్వు స్థానానికి ఎంపికైన గొల్లపల్లి మోడల్ స్కూల్ విద్యార్థిని కలకోట శ్రీజను ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు బుధవారం సన్మానించారు. జపాన్ సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిశీలించడానికి జరిగిన ఎంపిక పోటీల్లో ఆమె ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు.

సీసీ రోడ్లు నిర్మించాలి

మెట్‌పల్లి: పట్టణంలోని హనుమాన్ నగర్‌లో సీసీరోడ్లు నిర్మించాలని కాలనీవాసులు కోరారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కమిషనర్ మోహన్‌ను కలిసి, వినతిపత్రం అందించారు. కుక్కల బెడద తీవ్రంగా ఉందని, వాటిని దూరంగా తరలించాలని విన్నవించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జగిత్యాలరూరల్: చల్‌గల్ 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మోరపల్లి ఫీడర్ 11 కేవీ, చల్‌గల్ రూరల్ ఫీడర్ లైన్లకు మరమ్మతు చేపడుతున్నట్లు ఏఈ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. చల్‌గల్, మోరపల్లి గ్రామాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

యువతి అదృశ్యం

కథలాపూర్: సిరికొండకు చెందిన యువతి అదృశ్యమైనట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. యువతి మంగళవారం ఇంటి నుంచి వెళ్లిపోయి, తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు తమ బంధువుల ఇళ్లలో, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ తెలియలేదు. బుధవారం పోలీసులను ఆశ్రయించారు. వారి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

రాయికల్: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు ఎన్ఏఎస్‌పై శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా సెక్టోరియల్ ఆఫీసర్ రాజేశ్ మాట్లాడుతూ.. నవంబర్‌లో జరిగే పరీక్షలకు విద్యార్థులను ఏ విధంగా సిద్ధం చేయాలో అవగాహన కల్పించారు. ఎంఈవో గంగాధర్, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

పోస్టల్ సేవలు సద్వినియోగం చేసుకోండి

రాయికల్: పోస్టల్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని వెస్ట్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ సఫియొద్దీన్ అన్నారు. బుధవారం రాయికల్ మండలం ఇటిక్యాలలో పొదుపు పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.

ఆధార్ సేవలు వినియోగించుకోండి

ఆధార్ సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో గంగాధర్ కోరారు. బుధవారం రాయికల్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆధార్ నమోదు కేంద్రాన్ని ప్రారంభించారు. విద్యార్థులు ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలన్నారు. హెచ్ఎంలు శ్రీనివాస్, రాఘవులు, రమేశ్, నర్సయ్య, టీచర్లు పాల్గొన్నారు.

గ్రామాలకు కలెక్టర్ వస్తున్నారని..

- జగ్గాసాగర్‌లో హడావుడిగా విధులకు హాజరైన కార్యదర్శి
- వెల్లులలో మధ్యాహ్నం పారిశుధ్య పనులు చేసిన కార్మికులు
- మెట్‌పల్లి మండలంలోని మరికొన్ని గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ



ఉదయం 10.13 గంటలకు ఖాళీగా ఉన్న జగ్గాసాగర్ కార్యదర్శి కుర్చీ



వెల్లులలో చెత్తాచెదారాన్ని ట్రాక్టర్‌లో తరలిస్తున్న కార్మికులు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలంలోని పలువురు పంచాయతీ కార్యదర్శుల తీరు విస్మయం కలిగిస్తోంది. గ్రామాల్లో పారిశుధ్య పనులు నిత్యం చేపట్టాల్సి ఉండగా ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. వారిపై అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. బుధవారం గ్రామాల్లో కలెక్టర్ సత్యప్రసాద్ పర్యటన ఉందని మండల పరిషత్ అధికారులకు తెలిసింది. వెంటనే ఓ అధికారి పంచాయతీ కార్యదర్శులకు సమాచారం చేరవేశారు. దీంతో అప్రమత్తమైన పలువురు కార్యదర్శులు ఇంటికి వెళ్లిపోయిన కార్మికులను మధ్యాహ్న సమయంలో పిలిపించి, పారిశుధ్య పనులు చేయించారు. జగ్గాసాగర్‌లో కార్యదర్శి ఉదయం పంచాయతీ కార్యాలయానికి రాలేదు. కలెక్టర్ వస్తున్నారని తెలిసి, హడావుడిగా విధులకు హాజరయ్యారు. పారిశుధ్య కార్మికులు మధ్యాహ్నం 1.48 గంటలకు చెత్తాచెదారం తొలగించారు. ఇటీవల డెంగీ పాజిటివ్ వచ్చినవారి ఇళ్ల వద్ద, తాగునీటి ట్యాంకుల వద్ద బ్లీచింగ్ పౌడర్ చల్లారు. వెల్లులలో రోడ్డు పక్కనున్న చెత్తాచెదారాన్ని ట్రాక్టర్‌లో తరలించారు. జగ్గాసాగర్ కార్యదర్శి పంచాయతీ కార్యాలయానికి వచ్చేటప్పటికే మండల పరిషత్, రెవెన్యూ అధికారులు వచ్చి ఉన్నారు. ఆ తర్వాత కొద్దిసేపటికే కలెక్టర్ పర్యటన వాయిదా పడిందని తెలియగానే కార్యదర్శి అక్కడి నుంచి జారుకున్నారు. ఇతర గ్రామాల్లో సైతం పారిశుధ్య చర్యలు చేపట్టారు. మరికొన్ని గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి ఉందని స్థానికులు చెబుతున్నారు. పారిశుధ్య పనులను పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

ఆశవర్కర్లకు అండగా రాష్ట్ర ప్రభుత్వం



మాట్లాడుతున్న హన్మాండ్లు, పక్కన నాయకులు

మల్లాపూర్: ఆశవర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయిని హన్మాండ్లు అన్నారు. బుధవారం మల్లాపూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కరోనా సమయంలో క్షేత్రస్థాయిలో వైద్య సేవలందించిన ఆశవర్కర్లకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం కనీసం ఎన్-95 మాస్కులు సైతం అందించలేదని ఆరోపించారు. వారానికొక సెలవు కూడా ఇవ్వకుండా పని చేయించుకొని, శ్రమదోపిడీకి పాల్పడిందని మండిపడ్డారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్‌కి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించే అర్హత లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆశవర్కర్ల సమస్యలను పరిష్కరిస్తారని పేర్కొన్నారు. యూత్ కాంగ్రెస్ మండల ఇన్‌చార్జి జవిడి రాజరెడ్డి, నాయకులు సాంగ సందీప్‌యాదవ్, నూతిపెల్లి కృష్ణవేణు తదితరులు పాల్గొన్నారు.

'ఆశవర్కర్ల సమస్యలపై ఎమ్మెల్యే మాట్లాడటం విడ్డూరం'

మెట్‌పల్లి: ఆశ వర్కర్ల సమస్యలపై ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడటం విడ్డూరంగా ఉందని యూత్ కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి రైసుద్దీన్ అన్నారు. మెట్‌పల్లి పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే కొమొరెడ్డి రామ్‌లు నివాసంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి, సేవలందించిన ఆశవర్కర్లకు అప్పటి ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, ప్రస్తుత ఎమ్మెల్యే సంజయ్ ఎలాంటి సహాయం అందించలేదని ఆరోపించారు. ఆదివారం కూడా సెలవు ఇవ్వకుండా పని చేయిస్తే, మాజీ ఎమ్మెల్యే, దివంగత కొమొరెడ్డి రామ్‌లు తీసుకున్న చొరవతో సెలవు ప్రకటించారని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు నిర్లక్ష్యం వల్ల పెద్దాపూర్ గురుకుల పాఠశాల అభివృద్ధికి నోచుకోలేదన్నారు. నాయకులు అజీమ్, ప్రసాద్ తదితరులున్నారు.

'మహిళా శక్తి'తో ఆర్థికాభివృద్ధికి చేయూత

- జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి
- కౌన్సిల్ ప్రత్యే సమావేశం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ జ్యోతి

జగిత్యాల: ప్రభుత్వం మహిళా శక్తి పథకంతో మహిళల ఆర్థికాభివృద్ధికి చేయూతనిస్తుందని జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో కౌన్సిల్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక చేయూతనందించేందుకు ప్రభుత్వం ఈ పథకం తీసుకువచ్చిందని తెలిపారు. అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కమిషనర్ సమ్మయ్య, ఏవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొద్దిసేపు వాగ్వాదం..

ప్రొటోకాల్ మరిచారో ఏమో తెలియదు.. మున్సిపల్ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌కు సెపరేట్‌గా కుర్చీ వేయకపోవడంతో ఆయన కౌన్సిలర్ల మధ్యలో కూర్చున్నారు. ఈ విషయమై కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. చైర్‌పర్సన్, అధికారులు నచ్చజెప్పినప్పటికీ ఆయన ఇక్కడే బాగుందని, కూర్చున్నారు.

వాల్మీకి ఆవాస భవన నిర్మాణ పనుల ప్రారంభానికి ఆహ్వానం

జగిత్యాలటౌన్: పట్టణంలో సేవాభారతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాల్మీకి ఆవాస నూతన భవన నిర్మాణ పనుల ప్రారంభ కార్యక్రమానికి హాజరుకావాలని ఆవాసం ప్రతినిధులు కోరారు. ఈ మేరకు బుధవారం బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతిని కలిసి, ఆహ్వాన పత్రిక అందించారు. మధుకర్, సంపూర్ణాచారి, వెంకటేశ్వర్‌రావు తదితరులున్నారు.

పాపన్న విగ్రహావిష్కరణకు మంత్రికి ఆహ్వానం



ఇబ్రహీంపట్నం: డబ్బా గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణకు రావాలని గీత కార్మిక నాయకులు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో ఆయనను కలిసి, ఆహ్వాన పత్రిక అందజేశారు. సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెర్లపెల్లి రాజేశ్వర్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు చెట్ల చంద్రశేఖర్‌గౌడ్, మండల అధ్యక్షుడు నేరెళ్ల సూభాష్‌గౌడ్, నాయకులు అశోక్‌గౌడ్, సత్యంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



ధర్మపురి: ధర్మపురి మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. 2024 మార్చి నుంచి జూన్ వరకు ఆదాయ వ్యయాలు, బిల్లులు చెల్లింపు తదితర 22 అంశాలకు ఆమోదం తెలిపారు. వీటిలో కమలాపూర్, నక్కలపేట రూట్లలో ఉన్న ఇందిరమ్మ కాలనీల్లో, వివిధ వార్డుల్లో విద్యుత్ స్తంభాల ఏర్పాటు, బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు, హరితహారం మొక్కలు నాటడానికి కూలీలు, శానిటేషన్ వాహనాలకు జీపీఎస్ సిస్టం ఏర్పాటు, బస్తీ దవాఖానాలకు స్థలాల ఎంపిక తదితరాలున్నాయి. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రామన్న, కమిషనర్ శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీనివాస్, మేనేజర్ గంగాధర్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

స్పౌజ్ అక్రమాలపై పట్టించుకోవడం లేదని ఫిర్యాదు

జగిత్యాల: బదిలీల్లో స్పౌజ్ కేటగిరీలో కొంత మంది ఉపాధ్యాయులు నిబంధనలకు విరుద్ధంగా తమకు నచ్చిన స్థానాలకు ఆప్షన్లు ఇచ్చి, అక్రమాలకు పాల్పడ్డారని డీఈవోకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మచ్చ శంకర్, బైరం హరికిరణ్ ఆరోపించారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ సత్యప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. విద్యాశాఖలో అనేక అక్రమాలు జరుగుతున్నాయని, విచారణ చేపట్టాలని కోరారు. ఎల్ఎఫ్ఎల్, హెచ్ఎం పదోన్నతుల్లో డీఎస్సీ 1996కు చెందిన కొంతమంది ఎస్జీటీలను కాదని ఇద్దరికి మాత్రమే పదోన్నతులు కల్పించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. బదిలీలు, పదోన్నతుల సమాచారాన్ని చేరవేయడంలో డీఈవో నిర్లక్ష్యం వల్ల ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకోండి



సంగెంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రామకృష్ణ

కోరుట్ల రూరల్: ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను దళితులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. సంగెం గ్రామంలో బుధవారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. పలు చట్టాలపై అవగాహన కల్పించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌రావు, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, నాయకులు చీటి వెంకట్రావు, వెంకాగౌడ్, మాజీ సర్పంచ్ నర్సయ్య తదితరులున్నారు.

పోసానిపేటలో సివిల్ రైట్స్ డే

కథలాపూర్: పోసానిపేట గ్రామంలో బుధవారం సివిల్ రైట్స్ డే నిర్వహించారు. అధికారులు ఎస్సీ కాలనీలో పర్యటించి, స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. ఎవరైనా కుల వివక్ష చూపిస్తున్నారా అని అడిగారు. ప్రజలందరూ కలిసి మెలిసి ఉండాలని సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఎంఈవో ఆనందరావు, కార్యదర్శి సులోచన తదితరులు పాల్గొన్నారు.

హక్కులను వినియోగించుకోవాలి

పెగడపల్లి: పౌరులు తమ హక్కులను వినియోగించుకోవాలని ఎంపీవో మహేందర్ అన్నారు. రాములపల్లిలో బుధవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ప్రతీ పౌరుడు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. డిప్యూటీ తహసీల్దార్ రాజశేఖర్, ఆర్ఐ శ్రీనివాస్, పీఆర్ ఏఈ శంషేర్ అలీ, అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు దీకొండ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే పొలం బాట



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఈ మనోహర్

మెట్‌పల్లిరూరల్: గ్రామాల్లో విద్యుత్ సమస్యల పరిష్కారానికే పొలం బాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏడీఈ మనోహర్ తెలిపారు. మెట్‌పల్లి మండలంలోని ఆత్మకూర్, సర్కంపేటల్లో అధికారులు బుధవారం పొలం బాట చేపట్టారు. పొలాల్లో ఉన్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. విద్యుత్ ప్రమాదాల బారిన పడొద్దని, సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో డీఈ, ఏఈ, సిబ్బంది పాల్గొన్నారు.

రుణమాఫీ కాకపోవడంపై ఆరా



వేంపేట బ్యాంక్‌లో వివరాలు తెలుసుకుంటున్న ఇన్‌చార్జి ఏడీఏ లావణ్య

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం వేంపేట కెనరా బ్యాంక్ పరిధిలోని రైతులకు పంట రుణమాఫీ విషయంలో తలెత్తిన ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని మెట్‌పల్లి ఇన్‌చార్జి ఏడీఏ లావణ్య అన్నారు. మెట్‌పల్లి, మల్లాపూర్ మండలాలకు చెందిన పలువురికి రుణమాఫీ కాకపోవడంతో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి బుధవారం అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆమె కెనరా బ్యాంక్‌కు వెళ్లి, అధికారులను ఆరా తీశారు. రుణమాఫీ కానీ రైతుల వివరాలు తీసుకున్నారు. ఎవరూ ఆందోళన చెందవద్దని, మాఫీ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

'భగీరథ' పంప్ ఆపరేటర్ల జీతాలివ్వాలి



కలెక్టర్‌కు విన్నవిస్తున్న పంప్ ఆపరేటర్లు

ఇబ్రహీంపట్నం: తమకు జీతాలివ్వడం లేదని మిషన్ భగీరథ పంప్ ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ సత్యప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఎవరెస్ట్ కంపెనీలో నియామకమై, మిషన్ భగీరథలో 10 మందిమి పని చేస్తున్నామని తెలిపారు. ఒక్కొక్కరికి నెలకు రూ.10 వేల జీతం కాగా, 6 నెలలుగా ఇవ్వడం లేదని వాపోయారు. ఈఎస్ఐ, పీఎఫ్, ఐడీకార్డు ఇచ్చి, ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా కల్పించాలని విన్నవించారు.

ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయాలి

ఇబ్రహీంపట్నం: ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయాలని రైతు నాయకుడు బద్దం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. బుధవారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. వానాకాలం సాగుకు సంబంధించి రైతులు వరి నారు పోసి, నెల రోజులు గడుస్తున్నా కాలువలకు నీటిని విడుదల చేయడం లేదన్నారు. నారు ముదిరిపోయి, పంటల దిగుబడి తగ్గుతుందని, వెంటనే నీటిని విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో రైతులు పాపన్న, రాజారెడ్డి, నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ బాధితుడికి ఫేస్‌బుక్ మిత్రుల అండ

- రూ.1.33 లక్షల విరాళం



ధర్మపురి: పేదరికంతో కుటుంబపోషణ భారమై.. ఉపాధి కోసం అప్పు చేసి.. కొంతకాలం దుబాయి వెళ్లిన గల్ఫ్ కార్మికుడు అనారోగ్యంతో తిరిగిరాగా సదరు బాధిత కుటుంబానికి ఫేస్‌బుక్ మిత్రులు రూ.1.33 లక్షలు విరాళాలు అందించి అండగా నిలిచారు. మండలంలోని బుద్దేశ్‌పల్లెకి చెందిన రావుల రాజేశ్ మూడేళ్ల క్రితం దుబాయి వెళ్లాడు. అక్కడ తీవ్ర అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చేరాడు. దీంతో కంపెనీ స్వగ్రామానికి పంపించింది. ఇక్కడికొచ్చాక వైద్య ఖర్చులకు ఇబ్బంది పడ్డాడు. గుండె సమస్యతోపాటు కాలుకు రెండుసార్లు శస్త్ర చికిత్స చేయడంతో ఎక్కువ సేపు నిలబడలేడు. భార్య లావణ్య కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తూ ఇద్దరు కూతుళ్లను చదివిస్తోంది. ఆమె కూడా తరుచూ అనారోగ్యానికి గురవుతోంది. ఆ కుటుంబ దీనస్థితిని తెలుసుకున్న ధర్మపురికి చెందిన సామాజిక సేవకుడు రేణికుంట రమేశ్ జూలై 4న ఫేస్‌బుక్‌లో పోస్టు చేశాడు. వీరికి సాయం చేయాలని కోరాడు. స్పందించిన దాతలు లావణ్య బ్యాంకు ఖాతాకు రూ.1.33 లక్షలు విరాళాలు అందించారు. పిల్లల భవిష్యత్తు ఖర్చుల కోసం బ్యాంకులో కొంత ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి దానితో పాటు వైద్యం కోసం కొంత నగదును ఎస్‌బీఐ మేనేజర్ నరేశ్ చేతుల మీదుగా ఆమెకు పంపిణీ చేయించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



మల్యాల: ప్రతీ వాహనదారుడు విధిగా హెల్మెట్ ధరించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని మల్యాల ఎస్సై నరేశ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదంలో జరిగే అపార నష్టాన్ని హెల్మెట్ నియంత్రిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వాహనదారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉద్యోగులకు సన్మానం

కథలాపూర్: స్థానిక పీహెచ్‌సీలో పని చేసి, బదిలీపై వెళ్లిన ఉద్యోగులను బుధవారం సన్మానించారు. హెల్త్ సూపర్‌వైజర్ నాగభూషణం, స్టాఫ్ నర్సులు రష్మిత, కవిత, ఆఫీస్ సబార్డినేట్ ఎండీ.ముక్తార్‌లను సత్కరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి సింధూజ, సిబ్బంది శ్రీధర్, చిన్నరాజం, శ్రీనివాస్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌కు..

కోరుట్ల రూరల్: మండలంలోని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షైనీ మాథ్యూస్ బదిలీ అయ్యారు. ఆమెను అయిలాపూర్‌లో అంగన్‌వాడీ టీచర్లు బుధవారం సన్మానించారు.

బదిలీపై వెళ్తున్న టీచర్లకు..

మేడిపల్లి: భీమారం హైస్కూల్ టీచర్లు మహేశ్, రామ్‌నరేశ్, శ్వేత, వాస్తవిక, శ్రీధర్, రహీం, జ్యోతి, కిశోర్ బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా వారిని బుధవారం పాఠశాలలో సన్మానించారు. హెచ్ఎం అశోక్, ఎస్ఎంసీ చైర్‌పర్సన్ లావణ్య, మాజీ సర్పంచ్ అరుణ, మాజీ ఉపసర్పంచ్ బస్వరాజు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు అర్జున్, ఎస్ఎంసీ మాజీ చైర్‌పర్సన్ లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్: అంతర్గాం పాఠశాల సోషల్ టీచర్ నందెల్లి మదన్‌మోహన్‌రావు బుధవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవీందర్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సురేశ్, బోనగిరి నారాయణ, ప్రధానోపాధ్యాయుడు సింగు సత్తయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొక్కలు నాటాలి



రాయికల్: పర్యావరణ రక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు అన్నారు. వనమహోత్సవంలో భాగంగా బుధవారం రాయికల్ పట్టణంలోని 12వ వార్డులో ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేశారు.

సామాజిక చైతన్య దీక్షలకు రండి

పెగడపల్లి: ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు ఢిల్లీలో నిర్వహించే సామాజిక చైతన్య దీక్షలకు మాలలు అధిక సంఖ్యలో తరలిరావాలని మాల మహానాడు పెగడపల్లి మండల నాయకులు కోరారు. సంబంధిత కరపత్రాన్ని బుధవారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. మాలలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈ దీక్షలు చేపట్టేందుకు నిర్ణయించినట్లు పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడు రాజయ్య, మండల నాయకులు శ్రీనివాస్, అరుణ్, మల్లేశం, సుమన్, ప్రశాంత్ తదితరులున్నారు.

అభ్యసన నైపుణ్యాలు పెంచుకోవాలి

మల్లాపూర్: టీచర్లు అభ్యసన నైపుణ్యాలు పెంచుకోవాలని మండల నోడల్ అధికారి, రాఘవపేట స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం దామోదర్‌రెడ్డి అన్నారు. బుధవారం రాఘవపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నవంబర్‌లో దేశ వ్యాప్తంగా నిర్వహించే నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే–2024పై టీచర్లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

మూఢనమ్మకాలను అంతం చేయాలి

ధర్మపురి: విజ్ఞానంతో మూఢనమ్మకాలను అంతం చేయాలని భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పులేటి నరేశ్ అన్నారు. బుగ్గారం మండలంలోని శెకల్ల ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు దండె రాజశేఖర్ అధ్యక్షతన బుధవారం సైన్స్, మూఢ నమ్మకాల నిర్మూలన అనే అంశాలపై అవగాహన కల్పించారు. కత్తిని కడుపులో గుచ్చుకోవడం, చేతిపై కిరోసిన్ పోసి నిప్పంటించడం, నోట్లో మంటలు లేపడం వంటి ప్రదర్శనలు ఇచ్చారు.

పోచమ్మ బోనాలు



బోనం ఎత్తుకున్న బల్దియా చైర్‌పర్సన్ జ్యోతి




కోరుట్ల: బోనాలతో వెళ్తున్న భక్తులు

కోరుట్ల: పట్టణంలోని మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో బుధవారం పోచమ్మ బోనాలు నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు చెదలు సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు బండారి శంకర్, నాయకులు పాల్గొన్నారు.

మేరు సంఘం ఆధ్వర్యంలో..

జగిత్యాలటౌన్: పట్టణంలో మేరు సంఘం ఆధ్వర్యంలో బుధవారం పోచమ్మ బోనాలు తీశారు. బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతి హాజరై, గాజుల పోచమ్మ అమ్మవారికి బోనం సమర్పించారు. సంఘం నాయకులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ప్రధాని నాయకత్వంలో వర్గీకరణకు తుది రూపం



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు

సారంగాపూర్: ప్రధాన నరేంద్రమోదీ నాయకత్వంలో ఎస్సీ వర్గకరణకు తుది రూపం వచ్చిందని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు దుమాల గంగారాం, సురుగు శ్రీను, అధికారి ప్రతినిధి బెజ్జంకి సతీశ్ అన్నారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి, 30 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సారంగాపూర్ మండలం కేంద్రంలో బుధవారం జెండా గద్దె ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు వంశీ, సునీల్ తదితరులున్నారు.